# "నా జీవితం నాకిచ్చేయి!"

(కథానిక)

జానకీరాణి

"నీ తల్లి పార్వతమ్మ నీ తండ్రి నీలకంఠం పెట్టే బాధల్ని భరించలేక విడాకులకోసం అర్జీ పెట్టుకుంది. నువ్వు చెప్పేది ఏమైనా వున్నదా?" అతి గంభీరంగా వినవచ్చాయి సీతకి మేజస్ట్రేటు గారి యీ మాటలు. ఎర్రబడి, నిరాశతో నిండిన తన కళ్ళను ఒక్కసారి మేజస్ట్రేటువంక త్రిప్పి చూచింది సీత. తనేం చెప్తుంది? తల్లి కేసి చూసింది. బావురుమని ఏడవాలనిపించింది. వెల్లువలా ఉద్భవించిన దుఃఖం గొంతుకలో ఆగిపోయి, ఒక్క మూలుగుమాత్రం వినవచ్చింది. ఏమీ చెప్పకుండా వుండలేదు, ఏమీ చెప్పనూలేదామె. చెప్పాలి, తప్పదు. ఇరవై సంవత్సరాలుగా తాను చూస్తున్న చరిత్ర, అనుభవిస్తున్న వ్యధ చెప్పాలి. బహిరంగంగా తన తల్లి విషాద గాధని చెప్పాలి: సీత ఉపక్రమించింది.

"నా పేరు సీత. నా వయస్సు ఇరవై సంవత్సరాలు. పార్వతమ్మ నాతల్లిపేరు. నీలకంఠం నా తండ్రి. నాకు చదువురాదు. ధర్మాధర్మాలు తెలియవు. కాని కష్టాలంటేమిటో, వాటిని భరించడం ఎలాగో నాకు బుద్ధి తెలిసినప్పటినుంచీ మా కుటుంబాన్ని కష్టాలు వరించినంతగా సుఖాలు వరించలేదు. మా జీవితంలో ప్రతిక్షణాన్ని గురించి చెప్పదగినది బోలెడంత వున్నది. కాని అందరూ వాటిని వినలేరు. విన్నా నమ్మలేరు, సహించలేరు. మా నాన్న నీలకంఠం త్రాగుబోతు, జూదరి. ఆయన త్రాగందీ వుండలేడు. త్రాగిన తర్వాత మా అమ్మని హింసించనిదీ నిలవలేడు. నాకు జ్ఞానం వచ్చిన తర్వాత యీ పదహారు సంవత్సరాల్లోనూ మా నాన్న త్రాగని రోజుగానీ మా అమ్మని కొట్టని రోజుగానీ ఒక్కటికూడా లేదు. అదో సరదా ఆయనకి. ఇంటికి రాగానే అన్నం తినడం ఎంత సహజమో, మా అమ్మని హింసించడం అంత సహజం ఆయనకి. శారీరకమైన యీ బాధ ఏ మానవుడికైనా, అందులోనూ ఒక అబలను ఎంత నలిపివేస్తుందో ఊహించుకోండి.

మా నాన్నకి ఆస్తి ఏదో వున్నదని మా అమ్మ చెబుతుంది. కాని అది నా అనుభవంలోకి ఎన్నడూ రాలేదు. అది ఆయన త్రాగుడుకి, జూదానికి సరిపోతుంటుంది. మా తిండి విషయం ఆయనకు పట్టదు. మా బ్రతుకు ఆయనకి అక్కర్లేదు. మా అమ్మకి అండగా వున్న కారణాన నేనన్నా ఆయనకి ద్వేషమే. మా అమ్మ జీవిత భాగస్వామి కాదు, నేను ఆయన రక్తం పంచుకొన్న కూతురినికాను—ఇదీ ఆయన దృష్టి. రోజూ కొట్టడానికి తిట్టడానికి మేము మా నాన్నకి అవసరమౌతుంటాము. మాఅమ్మకి ఏదో ఆస్తివుండేది. అది ఏనాడో మానాన్న త్రాగుడుక్రింద ఖర్చైంది. ఇప్పుడు మాకు ఆధారం నా రెక్కల కష్టమే. ఒక పూట తింటే రెండోపూట లేదు. కాని మా నాన్నకి నా సంపాదనలో పాలు కావాలి. ఎంతోకొంత మా అమ్మని హింసించి పట్టుకుపోయి త్రాగేస్తాడు. ఇదే కథ రోజూ సాగుతుంది. ఇదే హింసాకాండ ఇరవై సంవత్సరాలుగా సాగిందని మా అమ్మ చెబుతుంది, నేను పదహారు సంవత్సరాలుగా చూస్తున్నాను.

ఇదీ మా జీవితం నా తల్లిజీవితం. మా అమ్మకి నేనేదిక్కు. రోజూ శరీరమంతా విరగ్గొట్టే యీ దెబ్బలు, మనస్సుకు వేయిప్రక్కలు చేసే ఈ తిట్లు తప్పవు. స్త్రీలు పరమ సహనమూర్తులని మీరు విన్నారు. కనీసం చదివారుకాదూ? కాని ఇలాంటి జీవితాన్ని మీరెక్కడా చదివి వుండరు. ఇరవై సంవత్సరాల కష్టాలు, మానసిక వ్యధలు మూర్తీభవించిన అభాగిని అదిగో. ఆమె నా తల్లి. జీవితం అంటే 'రోజాపూల పాన్పు' అని కదూ మీరంటారు? మా అమ్మ జీవితంలో వసంతఋతువులేదు. అందుకే ఆమె జీవితవృక్షం చిగురించదు. పూలు

పోయదు. ఎప్పుడూ దాన్నిండా ముళ్ళే కల్లలో మునిగిపోవాల్సిన యౌవనం ఎల్లాగడిచింది? శారీరక మానసిక హింసలమధ్య ఈ వయస్సులో ఆమె కోరుకునే దేమిటి? శాంతి. అదేలే దామెకు.

ఈ ఇరవై సంవత్సరాల జీవితంలో ఆమె చిరునవ్వు ఎరుగదు. కంటికి కునుకులేదు. కడుపు నిండా భోజనంలేదు. అంతా ఒకే దుఃఖవల్లరి, పెనుచీకటి. ఈ భయంకర అంధకారంలో తన ఆత్మలోనే జ్యోతి పెరిగించుకుని నాలోనే ఆశలన్నీ యిముడ్చుకుని జీవిస్తోంది నాతల్లి. ఒకరాత్రి మా నాన్న ఉగ్రనరసింహుడై వచ్చాడు. చాలా నీచంగా మాట్లాడాడు. అది మా అమ్మకి అవమానం కలిగించేది మాత్రమే కావు. మా అమ్మ ప్రాణానికి హానికలిగించేది. అన్ని సంవత్సరాల ఓర్పు మాయమైంది.

ఆమె సహించలేకపోయింది. మానాన్న మాటలు నేను ఉచ్చరింపదగినవి కావు. ఆయన మాటలన్నీ అంతే. మా అమ్మని తూలనాడాడు. మా శీలాలను శంకించాడు.తోచినవన్నీ మాట్లాడాడు. ఏంచేస్తాం. ఒకరి కడుపులో ఒకరు దాక్కొని రాత్రి తెల్లవార్లూ ఏడిచాం. మా అమ్మ బాధపడిందే కాని, ఆ బాధకు నివారణ, ఈ హింసకి ఒకతుది తేల్చుకోవడం అన్నవి ఆమె దృష్టిలోలేవు. ఈ సాహసం నాదే. మా పవిత్రమైన శీలాలను శంకించాడు మా నాన్న.

నా తండ్రి ఇదేనేరాన్ని మీముందు వుంచుతున్నాడు. నేను, నాతల్లి హీనస్థితిలోవున్నాం. కాని ఏ పురాకృతపుణ్యంవల్లనో మాకు ఇంతవరకు నైతికపతనం సంభవించలేదు. స్త్రీ ఏదైనా భరిస్తుందికాని అపనిందను సహించలేదు. నాలోను, నా తల్లిలోనూ యీ మంటే నేడు జ్వలిస్తోంది. ఇంతనీచమైన అభియోగాన్ని నా తల్లిమీదకు తెస్తున్న నా తండ్రి సాహచర్యాన్ని ఆమె సహించలేదు. లోకంలో ఎక్కడా ఇంత దీర్ఘకాలం హింసింపకలిగిన తండ్రినిగానీ, దాన్ని ఇంత సహనంతో భరింపగల తల్లినిగానీ చూడలేము.

నేనింతవరకు ఒక భీకరదృశ్యాన్ని మీ ముందు చిత్రించాను అదే నాతల్లి జీవితం. ఈ వికృత జీవితాన్ని భరించిన పార్వతమ్మను విముక్తి కలిగించండి. నా తల్లికి ఇకనైనా విముక్తి ప్రసాదించండి-అదే నా జీవితానికి సాఫల్యం."

సీతలో నిలువునా ఆవేశం తొణికింది. హృదయాంతరాళంనుంచి వచ్చిన ఆమె మాటలు కోర్టు గోడల్లో ప్రతిధ్వనించాయి. కోర్టు హాలంతా నిశ్శబ్దంగా వున్నది.

ఒక మూల కూర్చునివుంది పార్వతి. ఆమెకు ఏడ్చే ఓపికలేదు. కాని ఆమె రోదన ధ్వని మాత్రం సన్నగా వినిపిస్తోంది. సీత మాటలు ఇంతసేపూ ఆమె వింటోంది. తన జీవితాన్ని కుంచెతో రంగులురంగులుగా చిత్రించిన సీత మాటలు ఆమె వింటోంది. కాని ఆమె వేపుచూడలేకపోయింది. తనలో ఏదో మార్పు—తన ఆత్మలో ఏదో ఒక దివ్యశక్తి ప్రవేశిస్తున్నట్లుగా భావించింది ఆమె. తన బిడ్డ, తన హృదయంలో దాచుకున్న బిడ్డ యీనాడు తన జీవితాన్ని లోకంముందు విప్పుతోంది. ఏ సహనంతో తాను భర్తపెట్టిన బాధల్ని అనుభవించిందో ఆ సహనం ఇప్పుడు తనను విడిచి దూరంగా పోతున్నట్లుగా అనిపించింది. ఆమెను ఆవహించిన పిరికితనం పొరలు విడిపోతున్నట్లు, ఏవో క్రొత్త భావాలు పొడగట్టుతున్నట్లు ఆమెకి తోచింది. ఏమిటో యిదంతా ఏదో విప్లవం తనలో...? నలభై ఏళ్ళతనలో సీత ఏదో విప్లవాన్ని తెస్తోంది. పార్వతమ్మ ఈ భావపరంపరలో ఒదిగిపోయింది.

నీలకంఠం తన వాఙ్మూలాన్ని ఇచ్చాడు. తనకు త్రాగే అలవాటు అట్టే లేదనీ, ఆస్థి కూడా పాడు చేసింది తనుగాక, వేరెవరోనని అతను చెప్పుకున్నాడు. తాను ముందునుంచీ చాలా దయగా ప్రవర్తించినట్లూ, పార్వతమ్మ తన శీలాన్ని, తన కూతురి అందాన్ని బజారులో పెట్టిన తర్వాతే తను క్రూరత్వంలోకి దిగినట్లు చెప్పుకున్నాడు. అతి సహజమైన ధోరణిలో అతడు పార్వతమ్మ చేసిన అవినీతి కృత్యాలను ఏకరువుపెట్టాడు.

పార్వతమ్మ కూర్చుని వింటోంది. అన్నీ క్రొత్తగా వినపడుతున్నాయి ఆమె చెవులకి. సీత చేతుల్లో తన చేతులుంచి కూర్చుంది ఆమె. సీత ఆవేశంతో దహించుకుపోతోంది. తండ్రి చేసే ఈ అభూత కల్పనలు ఆమె రక్తాన్ని పొంగించి వేస్తున్నాయి. సీత నరాల్లోంచి ఏదో విద్యుత్తు తనలోకి ప్రవహిస్తున్నట్టుగా పార్వతమ్మకి అనిపించింది.

ఇరవై సంవత్సరాలు ఈ నీచుడితోనా తను గడిపింది? అదే ఆశ్చర్యంగా తోచింది ఆమెకి. తన పిరికితనం, సహనం తలచుకుంటే ఆమెకి అసహ్యం వేసింది. ఈ దురాగతానికి నిజంగానే అడ్డుకట్ట వేయాలి. సీత వుండగా తనకి భయమేమిటి? సీత వత్తాసుతో తాను విముక్తి ఎంత తేలిగ్గా సంపాదించవచ్చు! విముక్తి, స్వాతంత్ర్యం-ఎప్పుడూ తనదృష్టిపథాన గోచరించలేదీ పదాలు. సీత తీసుకొచ్చింది ఎక్కణ్ణుంచో! పైగా మనోవర్తికి కూడా అర్జీ పెట్టించింది తనబిడ్డ సీత!

"తల్లీ ఏమంటారమ్మా కోర్టువారూ" అనడిగింది సీతని మెల్లిగా.

"తప్పకుండా మనమాట నెగ్గుతుందమ్మా" తల్లి చేతుల్ని ప్రేమగా అదిమింది సీత.

"నాన్నంటే నీకు ఇష్టమా అమ్మా?" అడుగవద్దు అనుకుంటూనే తల్లిని ప్రశ్నించింది సీత మెల్లిగా.

పార్వతమ్మ ఏం చెప్తుంది? "ఔనుతల్లీ..." తాను అబద్ధం చెప్తోందా? ఏమో!

"అట్టే ఇష్టంలేదులే అమ్మా" అన్నది కాస్సేపాగి, చిన్నపిల్లని సమాధానపరుస్తున్నట్టుగా. తర్వాత తల్లీ బిడ్డలు మాట్లాడుకోలేదు. వారి చూపులే ఏవో సందేశాలు చెప్పుకున్నాయి. తల్లి ఇంగితం గ్రహించింది సీత! బిడ్డ అంతర్యం గ్రహించింది పార్వతమ్మ.

పార్వతమ్మ కోర్టులో చెప్పింది సీత కోరినట్లు ఆమె చెప్పడానికి మాటలు లేకపోయాయి. కానీ సీత ఏవో నేర్పింది. అవే అన్నది. భర్తని దూషించలేదు ఆమె. ఆమెలో ఏ ఆవేశం లేదు. నిర్వికారంగా తూచితూచి చెప్పింది అంతా. ఆమెలో ఏదో ధైర్యం, దేనికోసమో ఆశ కనుపించాయి. సీత ముఖంలోకి చూస్తూ, ఆమెచూపుల్లోంచి ధైర్యాన్ని పుణికి తీసుకున్నట్లు మాట్లాడింది పార్వతమ్మ.

సాక్ష్యాలు, వాజ్మూలాలూ పూర్తయినాయి. తీర్పుకోసం నిరీక్షిస్తున్నారంతా.

పార్వతమ్మ తన భర్తవంక చూచింది. ఒక రాక్షసుడల్లే గోచరించాడు నీలకంఠం. తన ఇరవై సంవత్సరాల జీవితం—పార్వతమ్మగుండెలో శూలం పొడిచినట్లయింది. ఎవరిస్తారు తనకీకాలం? గడచిపోయిన సంవత్సరాల్ని ఎవరు త్రిప్పి తీసుకొస్తారు? తానుగడిపిన కాళరాత్రుల్ని తిరిగి తీసుకొచ్చి సుఖంతో నింపుకోడానికి వీల్లేదుకదా. చీకటి రోజుల్లో ఒక్కమాటు వెన్నెల పండించి చూసుకోవడానికి అవకాశం లేదుకదా.

కోర్టువారు తీర్పుయిచ్చారు. "నీలకంఠంపెట్టే హింసలను భరించలేనందవల్లన, విడాకులకై పార్వతమ్మ పెట్టుకున్న అర్జీ పరిశీలించడమైనది. పార్వతమ్మ చెప్పినదంతా యథార్థమని కోర్టువారు అభిప్రాయ పడుతున్నారు. పార్వతమ్మ, నీలకంఠంల వివాహం రద్దు చేయబడినది. పార్వతమ్మ పరిస్థితిని పరిశీలించిన పిమ్మట, నీలకంఠానికి అప్పులుపోగా మిగిలిన ఆస్థి వున్నందువలన, నీలకంఠం భార్యకి మనోవర్తిక్రింద నెలకు ఇరవై రూపాయలు ఇవ్వవలసినదిగా తీర్పు యివ్వడమైనది."

నీలకంఠం లేచినిల్చున్నాడు. జేబులు తడిమాడు. వెండిరూపాయలు ఇరవై లెక్కపెట్టి తీశాడు. కోర్టు సమక్షానే పార్వతమ్మకు మొదటి నెల సొమ్మును అందచేయ తలచాడు.

పార్వతమ్మ అంతా వింటోంది చూస్తోంది. ఇరవై రూపాయలు మనోవర్తి ఇస్తున్నాడు రాక్షసుడు. తన జీవితంలో ఇరవై వసంతాలు నాశనంచేసిన నీలకంఠం తనకు ఈనాడు ఇరవై రూపాయలిచ్చి సంతృప్తి చెందమంటున్నాడు. తానేదో ఉపకారం చేసినట్లుగా సంతోషించమంటున్నాడు.

ఇరవై వెండిరూపాయలు ఆమె చేతిలోకి వచ్చాయి. నీలకంఠం తనవంకే చూస్తున్నాడు. భరించలేకపోయింది పార్వతమ్మ. ఆ రూపాయలు ఆమెచేతిలో పొడి ఐపోవాలి. మసి ఐపోవాలి. పార్వతమ్మ కళ్లు జేవురించాయి. పెదవులు వణికాయి ఆమె నిలువెల్లా కంపించింది.

ఘల్లుమన్న రూపాయల శబ్దానికి, 'అమ్మా' అన్న నీలకంఠం కేకకి కోర్టులోని వాళ్ళంతా వెనక్కితిరిగి చూశారు. పార్వతమ్మ విసిరిన రూపాయలు నీలకంఠం నుదటిని గాయపరిచాయి.

"తీసుకో నీ ఇరవై రూపాయలు! నా ఇరవై సంవత్సరాల జీవితాన్ని నాకిచ్చేయి!" బిగ్గరగా ఏడుస్తూ సీత చేతుల్లో పడిపోయింది పార్వతమ్మ.

(భావాంకురం: సోమర్‌సెట్ మాఘమ్ కథ)